క్లుప్తంగా

ఎన్నికల వ్యయాల పరిశీలన



ఎన్నికల వ్యయ పరిశీలన విభాగాన్ని పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకుడు ఆసిఫ్

కాకినాడ: ఎన్నికల వ్యయ పరిశీలకుడు, ఐఆర్ఎస్ అధికారి ఎ.ఆసిఫ్ శుక్రవారం కాకినాడలో పర్యటించారు. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం ఎన్నికల అధికారులతో ఆయన అభ్యర్థుల వ్యయాలను నమోదు చేసే విభాగాన్ని సందర్శించారు. ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చులను ఎలా నమోదు చేస్తున్నారో స్వయంగా పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఉన్న విభాగాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏఆర్వో చెల్లన్నదొర, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్‌తో పాటు పలువురు ఎన్నికల అధికారులు ఉన్నారు.

బీజేపీకి చిట్నీడి శ్రీనివాస్ రాజీనామా

బోట్‌క్లబ్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్నీడి శ్రీనివాస్ తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. పదేళ్లుగా ఆయన బీజేపీలో వివిధ పదవులు సమర్థంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాకినాడ ఎమ్మెల్యే టికెట్ బీజేపీకి వస్తుందని ముందు నుంచి అనుకున్నామని, కానీ టికెట్ రాకపోవడం బాధాకరమన్నారు. పొత్తులో భాగంగా కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గం సీటును టీడీపీకి కేటాయించారన్నారు. టీడీపీ అభ్యర్థి వనమాడి కొండబాబు బీజేపీ నాయకులను కలుపుకొని వెళ్లడం లేదన్నారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాలు చేస్తున్నారన్నారన్నారు. బీజేపీ నాయకులను దూరంగా పెడుతున్నారు. దీంతో విసిగిపోయి పార్టీ వీడినట్టు చెప్పారు. జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరినట్లు చెప్పారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పథకాలు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరినట్లు చెప్పారు.

టీడీపీ అభ్యర్థి వనమాడి నామినేషన్

కాకినాడ: నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావుకు ఆయన ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. తొలిరోజు ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు మూడేసి సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా, రెండో రోజు వనమాడి నామినేషన్ వేశారు. కాగా ప్రభుత్వ సెలవు రోజులు మినహా ఈ నెల 25వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్లు స్వీకరిస్తామని ఆర్వో వెంకటరావు తెలిపారు.

జనసేన అభ్యర్థి నామినేషన్ దాఖలు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాకినాడ రూరల్ అసెంబ్లీ స్థానానికి రెండో రోజు శుక్రవారం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది జనసేన తరఫున పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్‌కు అందజేశారు. దీంతో కాకినాడ రూరల్ నుంచి ఇప్పటికి రెండు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వాహనం ఢీకొట్టిన ఘటనలో రోడ్డు పక్కన పడి మృతి చెందిన కోన శ్రీను

కరప: మండలం వాకాడ సమీపంలో వాహనం ఢీకొని ఓ మోటారు సైక్లిస్ట్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెదకొత్తూరు గ్రామానికి చెందిన కోన శ్రీను (42) శుక్రవారం ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై కరప వెళ్తుండగా రామచంద్రపురం-కాకినాడ ప్రధాన రహదారిలో వాకాడ సమీపంలోని మలుపు వద్దకు వెళ్లేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు కోన రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వి.సూరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్ఐ సూరిబాబు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అచ్చంపేట నుంచి వెళ్తున్న సీఎం జగన్‌కు తిమ్మాపురంలో 116 గుమ్మడికాయలతో దిష్టి తీసిన మహిళలు



సిద్ధం సభకు తరలివస్తూ రాయుడుపాలెం జంక్షన్ వద్ద బస్సులో నుంచి వైఎస్సార్ సీపీ జెండాలతో చిన్నారుల సందడి



తిమ్మాపురం జంక్షన్ వద్ద ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అనుచరుడు ముత్యాల సతీష్ తదితరులు



ఏడీబీ రోడ్డు వద్ద బస్సు యాత్రలో ఉన్న సీఎం జగన్‌కు అభివాదం చేస్తున్న అభిమానులు

అన్న పిలుపే ప్రభంజనమై..

- కేడర్‌లో జోష్ నింపిన 'మేమంతా సిద్ధం' సభ
- రెట్టించిన ఉత్సాహంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు
- సుమారు 450 బస్సుల్లో వచ్చిన అభిమానులు
- ఎమ్మెల్యేలు కురసాల, ద్వారంపూడి తదితరుల ఆధ్వర్యంలో విజయవంతమైన కార్యక్రమం



మేమంతా సిద్ధం బహిరంగ సభా ప్రాంగణంలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

కాకినాడ రూరల్/కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న 'మేమంతా సిద్ధం' సభ విజయవంతం కావడంతో వైఎస్సార్ సీపీ కేడర్‌లో నూతనోత్సాహం నెలకొంది. కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని అచ్చంపేట జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. ఏడీబీ రోడ్డులో ఉండూరు క్రాస్‌రోడ్ జంక్షన్ వద్ద మధ్యాహ్నం భోజన విరామం అనంతరం సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభమైంది. సాయంత్రం 4.44 నిమిషాలకు సభాప్రాంగణం వద్దకు ఆయన చేరుకోవడంతో ప్రజలు కేరింతలతో తమ అభిమాన నాయకుడిని చూసేందుకు ఉత్సాహం చూపడమే కాకుండా జై జగన్... సీఎం.. సీఎం.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రోడ్డుపై నుంచే ప్రజలకు అభివాదం చేస్తూ సభా వేదికక వద్దకు చేరుకున్న సీఎం జగన్ సభా ప్రాంగణంలోని ర్యాంప్ పై నుంచి ప్రజల వద్దకు వెళ్లి రెండు చేతులు జోడించి అభివాదం చేశారు. ఈ సందర్భంగా వేలాదిగా తరలి వచ్చిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రజలు, కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంతో సీఎం జగన్‌కు జైజై ధ్వానాలు పలికారు. తొలుత కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సభనుద్దేశించి ప్రసంగించారు. సరిగ్గా 5.13 నిమిషాలకు సీఎం జగన్ తన ప్రసంగాన్ని ప్రారంభించి ఆద్యంతం ఆకట్టుకునేలా సుమారు 50 నిమిషాల పాటు అనర్గళంగా ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా 'మీ బిడ్డ జగన్ ఐదేళ్లలో చేసిన మంచిని చూసి ఓటు వేయండి' అని కోరారు. కూటమి పార్టీలను నమ్మవద్దన్నారు. జగనన్న చేసిన సంక్షేమ పథకాలు, చంద్రబాబు చేసిన హామీల మోసాలను తేడాలను వివరించి చంద్రబాబు తీరును ఎండగట్టారు. చంద్రబాబును ఉద్దేశించి పలు సినీ డైలాగులతో ఎండగట్టారు. అలాగే ప్యాకేజీ స్టార్ పవన్‌కు జ్వరమొస్తే హైదరాబాద్ వెళ్తారని, పెళ్లాలను మార్చినట్టు నియోజకవర్గాలను మార్చిన ప్యాకేజీ స్టార్ ఇప్పుడు పిఠాపురం వచ్చారని, ఆయనను నమ్మవద్దన్నారు.

'మేమంతా సిద్ధం' సభ తన నియోజకవర్గంలో జరిపేందుకు సీఎం జగన్ అనుమతివ్వడంతో ఎంతో ఉత్సాహంతో ఎమ్మెల్యే కన్నబాబు జన సమీకరణ చేసి కేడర్‌లో జోష్ నింపారు. నియోజకవర్గం నుంచి సుమారు 300 బస్సులు, ఇతర వాహనాల్లో భారీగా జనాలను తరలించడంతో ఎండను సైతం లెక్కచేయకుండా వారు మధ్యాహ్నం 3 గంటలకే చేరుకున్నారు. బస్సుల్లో జనాలు తరలింపు బాధ్యతను కన్నబాబు సోదరుడు కల్యాణ్ కృష్ణ విజయవంతంగా చేపట్టారు. ఎండను లెక్క చేయకుండా వచ్చిన మహిళలకు పెద్ద ఎత్తున శీతల పానీయాలు, వాటర్ ప్యాకెట్లు అందించారు. సీఎం సభ ముగింపు వరకు వేచి ఉన్న జనాలు అనంతరం ఆయన బస్సు యాత్రలోను అచ్చంపేట జంక్షన్ వరకు పాల్గొన్నారు. తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో 116 గుమ్మిడి కాయలతో సీఎం జగన్‌కు దిష్టి తీయించారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాకినాడ సిటీ నుంచి..

కాకినాడ సిటీ నియోజకవర్గంలోని నలుమూలల నుంచి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో దాదాపు 150 బస్సులు, ఆటోలలో ఇక్కడి నుంచి తరలి వెళ్లారు. దాడి పొడవునా జైజగన్ నినాదాలతో హోరెత్తించారు. సభా ప్రాంగణంలో సైతం వైఎస్సార్ సీపీ, జగన్ నినాదంతో మార్మోగింది. అచ్చంపేట జంక్షన్ వేదికగా జరిగిన సభ విజయవంతం కావడానికి ఇక్కడి పార్టీ నేతలు ప్రత్యేక దృష్టిసారించారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో పాటు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రశేఖరరెడ్డికి సంబంధించిన కేడర్ ప్రత్యేక ప్రణాళికతో సభను విజయవంతం చేశారు. ఇప్పటికే ఇంటింట ప్రచారంతో ఎన్నికల సమరంలో ముందున్న పార్టీ కేడర్‌కు జగన్ సభ మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా ప్రజల్లోకి వెళ్లి పార్టీ విజయమే లక్ష్యంగా మరో అడుగు ముందుకు వేసేందుకు సభ దిశానిర్దేశం చేసిందంటూ పార్టీ శ్రేణులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి. జగన్ సభకు తరలి వెళ్లే శ్రేణులతో కాకినాడ నగరమంతా సందడి సందడిగా మారింది. ఎమ్మెల్యే సూచన మేరకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్నతో పాటు వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఆయా క్లస్టర్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, గృహ సారథులు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య కార్యకర్తలు, నాయకులు సభకు తరలి వెళ్లారు. మొత్తంమీద సీఎం జగన్ సభ సక్సెస్ కావడం ఇక్కడి కేడర్‌కు కొత్త ఉత్సాహాన్ని నింపిందనడలో సందేహం లేదు.



సభా వేదికపై పాముల రాజేశ్వరిదేవి, శెట్టిబత్తుల రాజబాబు, పితాని బాలకృష్ణ, అంగూరి లక్ష్మి, మాకినీడి శేషుకుమారి, పాలసపల్లి సరోజ



అచ్చంపేట జంక్షన్‌లోని సిద్ధం సభ వద్ద గారడీ నృత్యం చేస్తున్న కళాకారులు

జగనన్న కోసం మేము సైతం



యండమూరు నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు



అచ్చంపేట సభాస్థలి వద్ద గొర్రిపూడి నాయకులు



కరప నుంచి 'మేమంతా సిద్ధం' సభకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: నియోజకవర్గంలోని కాకినాడ రూరల్ మండలం అచ్చంపేటలోని మేమంతా సిద్ధం సభకు మండల నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మోటార్ సైకిళ్లపై, ఆటోలతో బస్సులలో భారీగా తరలి వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పిలుపుమేరకు మండలంలోని నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంస్థల నాయకులు, అక్క, చెల్లెమ్మలు శుక్రవారం మధ్యాహ్నం మండుటెండను సైతం లెక్క చేయకుండా జై జగన్, జైజై జగన్, జగన్ నాయకత్వం వర్ధిల్లాలి, జై కన్నబాబు, కన్నబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ వెళ్లారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైస్ ఎంపీపీలు బొమ్మిడి వీర్రాఘవులు, పాట్నీడి భీమేశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, గ్రామ కమిటీల అధ్యక్షులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, అభిమానులు మోటార్ సైకిళ్లపై, ఆటోలలో, బస్సులలో నినాదాలు చేస్తూ ర్యాలీగా తరలివెళ్లారు.



మేము కూడా సిద్ధం అంటూ అచ్చంపేట వెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రను తన్మయంతో తిలకిస్తున్న మహిళ



అచ్చంపేట జంక్షన్ వద్ద మేమంతా సిద్ధం బహిరంగ సభా ప్రాంగణంలో కిక్కిరిసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



జగనన్నను గెలిపించడానికి మేము సైతం సిద్ధం అంటూ యువత విన్యాసాలు

ఉత్తుత్తి చేరికలతో వనమాడి అభాసుపాలు

కాకినాడ: ఉత్తుత్తి చేరికలతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మరోసారి అభాసుపాలయ్యారు. వైఎస్సార్ సీపీ నేతలు తమ పార్టీలోకి వలస వచ్చేస్తున్నారంటూ ప్రజల్లో భ్రమకలిగించేందుకు చేసిన ప్రయత్నం మరోసారి బెడిసికొట్టింది. స్థానిక 27వ డివిజన్ దూదిమిల్లు ప్రాతానికి చెందిన వైఎస్సార్ సీపీ క్రియాశీలక నేత వరిపల్లి శివను మాట్లాడేందుకు పిలిపించిన కొండబాబు గురువారం టీడీపీ కండువా కప్పేశారు. ఆ వెనుకే 'తెదేపా'లో వైకాపా నాయకులు చేరిక' పేరుతో పత్రికా ప్రకటన కూడా విడుదల చేసేశారు. వెంటనే తేరుకున్న శివ ఆ విషయాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడికి వివరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతున్న తాను భవిష్యత్‌లో కూడా ద్వారంపూడి వెంటే ఉంటానని, టీడీపీలో చేరే ప్రసక్తే లేదని ఆయనకు వివరించారు. వనమాడి చేసిన ఫేక్ జాయినింగ్ వల్ల టీడీపీ ప్రతిష్ఠ మరింత దిగజారిందంటూ ఆ పార్టీనేతలు గగ్గోలు పెడుతున్నారు.



ద్వారంపూడిని కలిసి సంఘీభావం తెలిపిన శివ

నగదు, మద్యంపై పటిష్ట నిఘా

- ఓటర్లను ప్రభావితం చేయకుండా చర్యలు
- పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు సాధిక్ అహ్మద్

కాకినాడ సిటీ: ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల అభ్యర్థులు నగదు, మద్యం వంటి వాటితో ఓటర్లను ప్రభావితం చేయకుండా చర్యలు చేపట్టాలని కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సాధిక్ అహ్మద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సాధిక్ అహ్మద్, తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు యోగేష్ కుమార్, పెద్దాపురం, కాకినాడ పట్టణం, జగ్గంపేట నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఎ.ఆసిఫ్ బృందం ట్రాన్స్‌పోర్టు, లీడ్ బ్యాంక్, ఎక్సైజ్, పోలీస్, కమర్షియల్ టాక్స్, పోస్టల్, కోస్ట్ గార్డ్, ఇన్‌కం టాక్స్ తదితర శాఖల అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధిక్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లాలో పార్లమెంట్, శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. నగదు, మద్యం, ఇతర వస్తువులతో ఓటర్లను ప్రభావితం చేయకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బ్యాంకులలో అనుమానాస్పదంగా జరిగే లావాదేవీలు, బదిలీలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మద్యం అక్రమంగా తరలించకుండా చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకుల బృందం ఆయా శాఖల ఎన్నికల సన్నద్ధతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మోహన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ ఎస్‌వీ ప్రసాద్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేబీవీ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీరామ కోటేశ్వరరావు, కమర్షియల్ టాక్స్, పోస్టల్, కోస్ట్‌గార్డ్, ఇన్‌కం టాక్స్, కస్టమ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు సాధిక్ తదితరులు

వైభవంగా రామలింగేశ్వరుని కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం శాస్త్రోక్తకంగా నిర్వహించారు. స్వామి వారికి ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, శ్రీజ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా మాండవ్యనారాయణుని కల్యాణం

సామర్లకోట: అతి పురాతన విష్ణు ఆలయమైన శ్రీ, భూ సమేత మాండవ్యనారాయణస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు మంగళ స్నానాలు, పంచామృతాలతో అభిషేకాలు, విష్వక్సేన పూజ, అంకురారోపణ, ధ్వజారోహణ చేశారు. ఆలయ భక్త బృందంచే విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. రాత్రి ఆలయ పండితులు చక్రవర్తుల రవి కుమార్, రఘురామ్‌ల ఆధ్వర్యంలో చైత్ర శుద్ధ ఏకాదశి పర్వదినంలో కల్యాణం జరిగింది. ఆలయంలో పూలతో అలంకరించిన ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి వేద మంత్రాలతో కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం ప్రసాద వితరణ జరిగింది. స్వామి వారి కల్యాణ ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. లోక కల్యాణార్థం ఏటా ఈ కల్యాణం జరుగుతుందని వేద పండితులు తెలిపారు. లయన్స్ క్లబ్ ఉప గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ దంపతులు, పారిశ్రామిక వేత్త బిక్కిన సాయి దంపతులు, తలుపుల అంజనీ కుమార్ దంపతులు భక్తులకు సేవలందించారు. 24వ తేదీ రాత్రి శ్రీపుష్ప యోగోత్సవంతో కల్యాణ ఉత్సవాలు ముగియనున్నాయి. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు సాగుతున్నాయి.



సామర్లకోటలో మాండవ్య నారాయణస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు